


ధర్మస్థళలో మే 1న సామూహిక వివాహాలు

బెంగళూరు, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): దక్షిణ కన్నడ జిల్లాలోని ప్రముఖ శైవ క్షేత్రమైన ధర్మస్థళలో మే 1న 52వ వార్షిక ఉచిత సామూహిక వివాహాలు జరుగనున్నాయి. ఈ మేరకు ధర్మస్థళ ధర్మాధికారి డి.వీరేంద్రహెగ్డే నగరంలో సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. దేవస్థానం తరపున వరుడి కి ధోవతి, శాలువ, వధువుకు చీర, రవిక, మంగళ సూత్రం అందజేస్తారు. ఏప్రిల్ 20లోగా పూర్తి సమాచారంతో సహా పంపుకోవాల్సి ఉంటుంది. 1972లో ప్రారంభించిన ఈ సామూహిక వివాహాల ద్వారా 12,777 మంది వైవాహిక జీవితంలోకి అడుగు పెట్టారు. పూర్తి సమాచారం కోసం 9663464648కు సంప్రదించాలని పేర్కొన్నారు.

కొత్త ముఖాలకు చోటు

● లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ నుంచి 10 మంది.. ● అధిష్ఠానం కసరత్తు
● ఫిబ్రవరి మొదటి వారంలో రాష్ట్రానికి అమిత్‌షా, నడ్డా ● డీకే సురేశ్‌ను టార్గెట్ చేసిన కుమారస్వామి



బెంగళూరు, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికల్లో మిషన్ 25 లక్ష్యంగా పెట్టుకున్న బీజేపీ కనీసం 10 మంది కొత్త అభ్యర్థులను రంగంలోకి దించేందుకు సిద్ధమైనట్టు తెలుస్తోంది. 70ఏళ్ల పైబడినవారికి టికెట్ ఇవ్వకుండా విద్యార్హత, వ్యక్తిగత వర్చస్సు, ప్రజలతో సంబంధాలు కలిగినవారికి టికెట్ ఇవ్వాలని భావిస్తున్నారు. రాష్ట్రంలో లోక్‌సభ టికెట్ల అంశాన్ని కొలిక్కి తెచ్చేందుకు ఇప్పటికే పలు సమావేశాలు జరిగాయి. ఫిబ్రవరి మొదటివారంలో కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా, పార్టీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా రాష్ట్రానికి వస్తున్నారు. నియోజకవర్గాల వారీగా వారు సమీక్ష జరపనున్నారు. ఇప్పటికే 28 లోక్‌సభ నియోజకవర్గాలకు ఒకరిద్దరు పేర్లు చొప్పున ఓ జాబితా సిద్ధమైంది. పార్టీ కేంద్ర ఎన్నికల కమిటీకి పంపాలని సూచించినట్టు తెలుస్తోంది. గెలుపొందే అభ్యర్థులను రంగంలోకి దించాలని పార్టీ అధిష్ఠానం రాష్ట్ర నేతలకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చినట్టు తెలుస్తోంది. 70 ఏళ్ల పైబడి ప్రజల్లో తిరగలేనివారికి, నియోజకవర్గం పట్ల ఏమాత్రం పట్టించుకోనివారికి మరోసారి టికెట్ ఇవ్వరాదని తీర్మానించినట్టు సమాచారం. గత ఎన్నికల్లో ఓటమి చెందినవారు, కొత్తగా పార్టీలో చేరినవారికి గల ప్రజాదరణపైన సర్వే చేయిస్తున్నట్టు సమాచారం. కాంగ్రెస్ నుంచి సొంతగూటికి వచ్చిన మాజీ సీఎం జగదీశ్ శెట్టర్, కల్యాణ కర్ణాటక పార్టీ ఎమ్మెల్యే జనార్దనరెడ్డితోపాటు వివిధ రంగాలలో సేవలందిస్తూ ప్రాచుర్యం పొందినవారికి టికెట్లు ఇచ్చే అంశంపై కూడా పరిశీలిస్తున్నట్టు సమాచారం. రానున్న ఎన్నికల్లో సిట్టింగ్ ఎంపీలు శ్రీనివాసప్రసాద్, బచ్చేగౌడ, బసవరాజ్, దేవేంద్రప్ప పోటీ చేసేది లేదని ఇప్పటికే స్పష్టం చేశారు. వారి స్థానంలో కొత్త అభ్యర్థులను పరిశీలిస్తున్నారు. ధారవాడలో ప్రహ్లాద్‌జోషి లేదా జగదీశ్ శెట్టర్‌లలో ఎవరికి ఆదరణ ఉంటుందనే కోణంలో కూడా సర్వే జరిపించనున్నట్టు తెలుస్తోంది. శెట్టర్ పోటీకి సిద్ధమైతే ప్రహ్లాద్‌జోషిని రాజ్యసభకు పంపే పరిశీలన కూడా ఉన్నట్టు సమాచారం. బెళగావిలో సిట్టింగ్ ఎంపీ మంగళా సురేశ్ అంగడికి బదులుగా ఆమె కుమార్తె, జగదీశ్ శెట్టర్ కోడలు శ్రద్ధా శెట్టర్ పేరును పరిశీలిస్తున్నారు. ఇదే స్థానానికి మాజీ ఎమ్మెల్సీ మహంతేశ్ కౌటగి పేరు కూడా ఉంది. చిక్కోడి నుంచి మరోసారి అన్నాసాహెబ్ జొల్లెకు అవకాశం ఉన్నా మాజీ మంత్రి, దివంగత ఉమేశ్‌కత్తి సోదరుడు రమేశ్‌కత్తి కూడా ప్రయత్నాలు చేస్తున్నారు. ఉత్తరకన్నడలో అనంతకుమార్ హెగ్డే టికెట్ డోలాయమానంలో ఉండగా ఇక్కడి నుంచి మాజీ స్పీకర్ విశ్వేశ్వరహెగ్డే కాగేరి పేరు పరిశీలనలో ఉన్నట్టు తెలుస్తోంది. మైసూరుకు మరోసారి ప్రతాప్‌సింహ పేరు ఉండగా చామరాజనగర నుంచి సిట్టింగ్ ఎంపీ శ్రీనివాస ప్రసాద్ అల్లుడు డాక్టర్ ఎన్ఎస్ మోహన్ పేరు ప్రధానంగా ఉంది. చిక్కబళ్లాపుర నుంచి బచ్చేగౌడకు టికెట్ ఇవ్వరాదని తేల్చారు. ఆయన కూడా పోటీకి సిద్ధంగా లేరనే విషయం తెలిసిందే. ఈ స్థానం నుంచి మాజీ మంత్రి సుధాకర్, యలహంక ఎమ్మెల్యే ఎస్ఆర్ విశ్వనాథ్ కుమారుడు అలోక్ విశ్వనాథ్, మాజీ మంత్రి ఎంటీబీ నాగరాజ్ కుమారుడు నితేశ్, బుడవనహళ్లి లోకేశ్‌గౌడ పేర్లు పరిశీలనలో ఉన్నాయి. డాక్టర్ సుధాకర్ ఇటు బీజేపీ అగ్రనేతలతో పాటు కుమారస్వామిని భేటీ కావడంతో ఆయనకు టికెట్ దక్కినా ఆశ్చర్యపోవాల్సిన పనిలేదని సమాచారం. బాగల్కోట నుంచి బసనగౌడ పాటిల్ యత్నాళ్, బిజాపుర రమేశ్ జిగజిణగి, కలబురగి డాక్టర్ ఉమేశ్ జాధవ్, బీదర్ భగవంత్‌ఖూబా, కొప్పళ కరడి సంగణ్ణకు బదులు జనార్దనరెడ్డి, బళ్లారి నుంచి బీ. శ్రీరాములు, దావణగెరె నుంచి జీఎం సిద్ధేశ్వర్ లేదా ఎంపీ రేణుకాచార్య, శివమొగ్గ నుంచి బీవై రాఘవేంద్ర, ఉడుపి - చిక్కమగళూరు శోభాకరంద్లాజె పేర్లు ఉన్నాయి. బెంగళూరు నగర పరిధిలో టికెట్ల కేటాయింపు అంశం జేడీఎస్ పొత్తుతో ముడిపడింది. జేడీఎస్‌కు హాసన్, మండ్య, బెంగళూరు గ్రామీణ కేటాయించే అవకాశం ఉంది. అదే జరిగితే బెంగళూరు ఉత్తర నుంచి సదానందగౌడ, బెంగళూరు సెంట్రల్ నుంచి పీసీ మోహన్ లేదా సుమలత బరిలో ఉండవచ్చు. బెంగళూరు దక్షిణ బీజేపీకి అనుకూలమైనది. సిట్టింగ్ ఎంపీ తేజస్వి సూర్యను కాకుండా కేంద్ర మంత్రి జైశంకర్‌ను ఇక్కడి నుంచి పోటీ చేయించే ఆలోచన ఉన్నట్టు తెలుస్తోంది.

డీకే సురేశ్‌ను టార్గెట్ చేసిన కుమార

బెంగళూరు గ్రామీణ జిల్లా ఎంపీ డీకే సురేశ్‌ను జేడీఎస్ నేత, మాజీ సీఎం కుమారస్వామి టార్గెట్ చేసుకున్నట్టు తెలుస్తోంది. 2019 ఎన్నికల్లో కాంగ్రెస్ నుంచి గెలుపొందిన ఏకైక ఎంపీ సురేశ్. 2019 ఎన్నికల్లో డీకే సురేశ్‌కు 8.78 లక్షలు, బీజేపీ అభ్యర్థి అశ్వత్థనారాయణకు 6.71 లక్షలు ఓట్లు దక్కాయి. అయితే జేడీఎస్ నుంచి వరుసగా రెండుసార్లు పోటీ చేసిన ప్రభాకరరెడ్డి 3 లక్షల దాకా ఓట్లు సాధిస్తూ వచ్చారు. బీజేపీ, జేడీఎస్ కలిస్తే కాంగ్రెస్ అభ్యర్థిని ఓడించవచ్చునని కుమారస్వామి భావిస్తున్నారు. అందుకే బెంగళూరు గ్రామీణ టికెట్‌ను పొత్తులో భాగంగా స్వీకరించే ఆలోచనలో ఉన్నారు. అదే జరిగితే డీకే సురేశ్‌కు ప్రత్యర్థిగా కుమారస్వామి మారే అవకాశం ఉంది.

కొప్పళ లోక్‌సభ బరిలో
ప్రియాంక గాంధీ..?

● ఢిల్లీ నేతల పర్యవేక్షణలో సర్వేలు



బెంగళూరు, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): త్వరలో జరిగే లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ముఖ్యనేత ప్రియాంకగాంధీ రాష్ట్రం నుంచి పోటీ చేస్తారని గత రెండురోజులుగా చర్చ జరుగుతోంది. ఢిల్లీ నుంచి బెంగళూరు దాకా ఇదే హాట్ టాపిక్‌గా మారింది. ప్రియాంకగాంధీని రాష్ట్రం నుంచి పోటీ చేయించడం ద్వారా ఎక్కువ స్థానాల్లో విజయం సాధించవచ్చునని రాష్ట్ర పార్టీ నేతలు ఆలోచనగా ఉన్నట్లు సమాచారం. అందుకే సురక్షితమైన నియోజకవర్గాన్ని ఎంపిక చేసినట్టు తెలుస్తోంది. రాష్ట్ర నేతలకు సమాచారం లేకుండానే ఢిల్లీ ముఖ్యుల పర్యవేక్షణలోని బృందాలు కొప్పళ నియోజకవర్గంలో సర్వే జరిపినట్లు తెలిసింది. ప్రియాంకగాంధీని తెలంగాణ నుంచి కూడా పోటీ చేయించాలనే డిమాండ్ ఉంది. ప్రస్తుతం దక్షిణాదిన రెండు రాష్ట్రాల్లో పటిష్టమైన కాంగ్రెస్ ప్రభుత్వాలు ఉన్నందున ఇక్కడి నుంచే పోటీ చేయించాలని తద్వారా ఇక్కడ ఎక్కువ ఎంపీ స్థానాలు కైవసం చేసుకోవాలని పార్టీ పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది. కాంగ్రెస్ పార్టీ నాయకులు, క్రియాశీలక కార్యకర్తలు సోషల్ మీడియా వేదికగా ప్రియాంకగాంధీని ఆహ్వానిస్తున్నారు. రాష్ట్రానికి చెందిన ముఖ్యనేతలకు సమగ్ర సమాచారం లేక పోవడంతో ఈ ప్రచారంపై ఎటువంటి వ్యాఖ్యలు చేయడం లేదు. బీజేపీకి చెందిన కొప్పళ లోక్‌సభ సభ్యుడు కరడి సంగణ్ణకు సొంతపార్టీలోనే తీవ్ర వ్యతిరేకత వచ్చింది. అతడికి కాకుండా మరెవరికైనా టికెట్ ఇవ్వాలని బహిరంగంగానే నియోజకవర్గానికి చెందిన ముఖ్యులు డిమాండ్ చేస్తున్నారు. ఇటీవలే బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు విజయేంద్రను కలిసిన స్థానిక ముఖ్యులు మరోసారి సంగణ్ణకు టికెట్ ఇస్తే సహకరించేది లేదని తేల్చి చెప్పినట్లు సమాచారం. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉండటం, పైగా ఎన్నికలకు ముందు ప్రకటించిన ఐదు గ్యారెంటీలు అమలుచేస్తుండటంతో లోక్‌సభ ఎన్నికలలోను గెలుపు సునాయాసమని కాంగ్రెస్ వర్గాలు భావిస్తున్నాయి. కొప్పళ పరిధిలో 8 శాసనసభ నియోజకవర్గాలు ఉండగా ఆరుచోట్ల కాంగ్రెస్ విజయం సాధించగా ఒక స్థానంలో గాలి జనార్దనరెడ్డి మరోస్థానంలో బీజేపీ విజయం సాధించాయి. ప్రస్తుతం కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ఎక్కువ ఉన్నందున విజయం సాధ్యమనే అంచనాలతోనే ప్రియాంకగాంధీని ఆహ్వానిస్తున్నట్లు సమాచారం.

రాష్ట్రానికి గాంధీ కుటుంబంతో దశాబ్దాల అనుబంధం

రాష్ట్రానికి గాంధీ కుటుంబంతో దశాబ్దాలుగా ప్రత్యేక సంబంధాలు ఉన్నాయి. ఇందిరాగాంధీకి రాజకీయంగా పునర్జన్మ ఇక్కడి నుంచే సాధ్యమైంది. చిక్కమగళూరు నుంచి ఇందిరాగాంధీ విజయం సాధించగా 1999లో సోనియాగాంధీ బళ్లారి నుంచి పోటీ చేసి విజయం నమోదు చేశారు. అదే తరహాలోనే ప్రియాంకగాంధీని కూడా రాష్ట్రం నుంచి పోటీ చేయించాలని అధిష్ఠానం ఆలోచనగా ఉన్నట్లు తెలుస్తోంది. ప్రియాంకగాంధీ పోటీపై రెండు వారాలలో స్పష్టత వచ్చే అవకాశం ఉంది.

రాష్ట్రంలో 4 రాజ్యసభ స్థానాలకు ఎన్నికలు

● షెడ్యూల్ విడుదల ● ఫిబ్రవరి 27న ఎన్నిక

బెంగళూరు, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని నాలుగు రాజ్యసభ స్థానాలకు ఫిబ్రవరి 27న ఎన్నిక జరగనుంది. రాజ్యసభ సభ్యులు రాజీవ్ చంద్రశేఖర్, జీసీ చంద్రశేఖర్, డాక్టర్ ఎల్.హనుమంతయ్య, సయ్యద్ నాసిర్ హుస్సేన్ పదవీ కాలం ఏప్రిల్ 2న ముగియనుంది. వీరిలో రాజీవ్ చంద్రశేఖర్ బీజేపీ సభ్యుడు కాగా మిగిలిన ముగ్గురు కాంగ్రెస్‌కు చెందిన వారు. ఈ ఎన్నిక నోటిఫికేషన్ ఫిబ్రవరి 8న విడుదల కానుంది. నామినేషన్లు దాఖలు చేసేందుకు ఫిబ్రవరి 15 వరకు గడువు ఉంటుంది. మరుసటి రోజు వీటిని పరిశీలిస్తారు. నామినేషన్ల ఉపసంహరణకు ఫిబ్రవరి 20 చివరి తేదీగా ఉంటుంది. అవసరమైతే పోలింగ్ ఫిబ్రవరి 27న ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు జరగనుంది. అదే రోజు సాయంత్రం 5 గంటల నుంచి ఓట్ల లెక్కింపు చేపడతారు. మొత్తం ఎన్నికల ప్రక్రియను ఫిబ్రవరి 29 నాటికి పూర్తి చేస్తారు. శాసనసభలోని మొత్తం 224 మంది ఎమ్మెల్యేలు తమ ఓటు హక్కును ఈ ఎన్నికల్లో వినియోగించుకుంటారని రాష్ట్ర చీఫ్ ఎలక్షన్ కమిషనర్ మనోజ్ కుమార్ మీనా ఓ ప్రకటనలో తెలిపారు.

కల్యాణ కర్ణాటక కాంగ్రెస్ ఎమ్మెల్యేలకు రూ.5 కోట్ల గ్రాంటు కేటాయింపు

● అభివృద్ధిలోనూ కాంగ్రెస్ రాజకీయం : బీజేపీ

బెంగళూరు, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): కల్యాణ కర్ణాటక ప్రదేశాభివృద్ధి మండలి (కేకేఆర్‌డీబీ)కు 2023-24 ఆర్థిక సంవత్సరానికి గాను కేటాయించిన రూ. 9వేల కోట్ల మొత్తంలో ముఖ్యమంత్రి సిద్ధరామయ్య 3 శాతం అంటే రూ. 90 కోట్లను ఈ ప్రాంతానికి చెందిన కాంగ్రెస్ ఎమ్మెల్యేలకు కేటాయించారు. మొత్తం 19 మంది కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ఒక ఇండిపెండెంట్ ఎమ్మెల్యేకు ఈ మేరకు నిధులను విడుదల చేస్తూ ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ లెక్కన ప్రతి ఎమ్మెల్యే నియోజకవర్గానికి సుమారు రూ. 5 కోట్లు అందుబాటులోకి రానున్నాయి. ఈ ప్రత్యేక గ్రాంటుతో ఆయా నియోజకవర్గాల్లో ఎమ్మెల్యే వివేచన మేరకు అత్యవసర అభివృద్ధి పనులను చేపట్టనున్నారు. కాంగ్రెస్ ఎమ్మెల్యేలకు మాత్రమే ఈ గ్రాంట్లను విడుదల చేయడంపై ప్రధాన ప్రతిపక్షమైన బీజేపీ మండిపడింది. అభివృద్ధి కోసం ఉద్దేశించిన నిధుల విడుదల విషయంలోనూ కాంగ్రెస్ ప్రభుత్వం రాజకీయం చేస్తోందని ప్రతిపక్ష నేత ఆర్. అశోక్ విమర్శించారు.

తుమకూరు జిల్లాపై సీఎం వరాలు

● ఒకేరోజు రూ.697.27 కోట్ల పనులకు శ్రీకారం ● ప్రశాంత గ్రామాల్లో బీజేపీ మతవిద్వేషాలు : సీఎం

బెంగళూరు, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని తుమకూరు జిల్లాలో పర్యటించిన ముఖ్యమంత్రి సిద్ధరామయ్య పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించడంతోపాటు మరికొన్నింటికి శంకుస్థాపనలు చేశారు. సోమవారం తుమకూరుకు చేరుకున్న ముఖ్యమంత్రికి ఘనస్వాగతం లభించింది. ముఖ్యమంత్రి తన జిల్లా పర్యటనలో భాగంగా 30,128 మంది లబ్ధిదారులకు ప్రభుత్వ సంక్షేమ ఫలాలను అందజేశారు. ఒకేరోజు రూ.697.27 కోట్ల మేరకు అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. వీటిలో జలజీవన్ మిషన్ పథకంలో 658 ప్రాజెక్టులు ఉన్నాయి. కొరటగెరె - మావత్తూరు - కొండేబావి రహదారిపై 6.50 కిలోమీటర్ల పంతెన పునఃనిర్మాణానికి సీఎం శంకుస్థాపన చేశారు. మధుగిరి తాలూకా శంభోనహళ్లి గేట్ నుంచి గంజలగుంటె, మరవేకెరె గ్రామాల మీదుగా 75 మీటర్ల పరిధిలో బాక్స్ కల్వర్ట్ నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టారు. తుమకూరు గ్రామీణ, తురువేకెరె, తిపటూరు శాసనసభ నియోజకవర్గాల పరిధిలో కర్ణాటక పబ్లిక్ పాఠశాలలు, వివేకా పాఠశాల గదులు, పీయూ కళాశాల నిర్మాణ పనులకు సీఎం శంకుస్థాపన చేశారు. సిద్ధగంగామఠం ఆవరణలో స్టేడియం పనులకు, నాబార్డ్ ద్వారా తుమకూరు తాలూకాలో చేపట్టదలిచిన రహదారి అభివృద్ధి పనులకు సీఎం శంకుస్థాపన చేశారు.

పలు అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం

తుమకూరు స్మార్ట్‌సిటీ పథకంలో భాగంగా బస్టాండ్ తొలిదశను ముఖ్యమంత్రి లాంఛనంగా ప్రారంభించారు. తుమకూరు విశ్వవిద్యాలయ నూతన క్యాంపస్‌ను, విద్యుత్ ప్రాజెక్టులను ప్రారంభించిన సీఎం తుమకూరు జిల్లాను అన్ని రంగాల్లో అగ్రగామిగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందన్నారు. పావగడ తాలూకాలోని అనేక గ్రామాల్లో పాఠశాల తరగతి గదులతోపాటు తాగునీటి ప్రాజెక్టులను సీఎం లాంఛనంగా ప్రారంభించారు. గుబ్బి పట్టణంలో నూతనంగా నిర్మించిన దేవరాజ్ అరసు భవనాన్ని ప్రారంభించారు.

మత విద్వేషాలు రెచ్చగొడుతున్న బీజేపీ

రాష్ట్రంలో గ్యారెంటీ పథకాలతో కాంగ్రెస్‌కు రోజురోజుకు పెరుగుతున్న ప్రజాదరణను ఓర్వలేక బీజేపీ, జేడీఎస్ మత విద్వేషాలు రెచ్చగొడుతున్నాయని



వివిధ అభివృద్ధి పథకాల ప్రారంభంలో సీఎం సిద్ధరామయ్య, డీసీఎం డీకే శివకుమార్ తదితరులు

ముఖ్యమంత్రి సిద్ధరామయ్య ఆరోపించారు. తుమకూరులో ఆయన మీడియాతో మాట్లాడుతూ బీజేపీ, ఆర్ఎస్ఎస్ కుట్రల కారణంగా ప్రశాంతంగా ఉన్న గ్రామాల్లో అశాంతి నెలకొంటోందన్నారు. భగవాన్ జెండా ఏర్పాటుకు ప్రభుత్వం వ్యతిరేకం కాదని, అయితే జాతీయ పతాకం కోసం అనుమతి తీసుకుని అందుకు వ్యతిరేకంగా వ్యవహరించడం వల్లే అధికారులు చర్యలు తీసుకున్నారని తెలిపారు. జాతీయ పతాకాన్ని ఘోరంగా అవమానించినవారిని బీజేపీ నేతలు సమర్థిస్తున్నారని, ఇది వారి దేశభక్తికి మచ్చుతునక అంటూ ఎద్దేవా చేశారు. రాష్ట్ర ప్రజలు శాంతిప్రియులని, బీజేపీ, జేడీఎస్ వలలో చిక్కుకోరని పేర్కొన్నారు.

బెంగళూరు తరహాలో తుమకూరు అభివృద్ధి

తుమకూరు జిల్లాను బెంగళూరు తరహాలో అభివృద్ధి చేస్తామని ఇందుకు తమ వద్ద పక్కా ప్రణాళిక ఉందని కార్యక్రమంలో పాల్గొన్న ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్ పేర్కొన్నారు. రాష్ట్రంలో అభివృద్ధి జరగడం లేదంటూ... ప్రతిపక్షాలు చేస్తున్న విమర్శలను తిప్పికొట్టారు. తుమకూరు సీఎం సభకు జనం భారీగా హాజరయ్యారని ప్రభుత్వ పథకాల ద్వారా వేలాదిమంది లబ్ధి పొందారన్నారు. అభివృద్ధి రాజకీయాలు కావాలో... మత విద్వేష రాజకీయాలు కావాలో... ప్రజలే నిర్ణయించుకోవాలన్నారు. తుమకూరు జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి డాక్టర్ పరమేశ్వర్‌తోపాటు మంత్రి రాజణ్ణ, కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ అభ్యర్థుల నామినేషన్

● కాంగ్రెస్ తరపున పుట్టణ్ణ ● బీజేపీ, జేడీఎస్ ఉమ్మడి అభ్యర్థిగా రంగనాథ్



నేతలతో కలిసి నామినేషన్ వేస్తున్న రంగనాథ్

మంత్రులతో కలిసి ర్యాలీగా వస్తున్న కాంగ్రెస్ అభ్యర్థి పుట్టణ్ణ



బెంగళూరు, జనవరి 29(ఆంధ్రజ్యోతి): బెంగళూరు టీచర్స్ ఎమ్మెల్సీ స్థానానికి కాంగ్రెస్ తరపున పుట్టణ్ణ నామినేషన్ దాఖలు చేశారు. శాంతినగర్‌లో ప్రాంతీయ ఎన్నికల రిటర్నింగ్ అధికారికి మంత్రులు ఎంసీ సుధాకర్, జమీర్‌అహ్మద్‌లతో కలిసి సోమవారం నామినేషన్ పత్రాలను సమర్పించారు. అంతకు ముందు పుట్టణ్ణ భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పుట్టణ్ణ మాట్లాడుతూ ఉపాధ్యాయుడిగా జీవితాన్ని ప్రారంభించి వారి సమస్యల పరిష్కారం కోసమే పాటుపడుతున్నట్లు తెలిపారు. గత ఎన్నికలలోను సంపూర్ణ మద్దతు ఇచ్చారని, మరోసారి ఆదరించాలని కోరారు. మంత్రి ఎంసీ సుధాకర్ మాట్లాడుతూ రాష్ట్రంలో బీజేపీ కుట్రలను ప్రజలు గమనిస్తున్నారన్నారు. పుట్టణ్ణ గెలుపుద్వారా లోక్‌సభ ఎన్నికలకు ముందే మరో తీపికబురు రావాలని పిలుపునిచ్చారు. మంత్రి జమీర్‌అహ్మద్ మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం పుట్టణ్ణ సేవలు అందిస్తున్నందునే ఆయనకు ఆదరణ లభిస్తోందని, మరోసారి ఆశీర్వదించాలని ఉపాధ్యాయులను కోరారు. పుట్టణ్ణ తొలుత జేడీఎస్ పార్టీ ద్వారా ఇదే స్థానంలో విజయం సాధించగా తర్వాత బీజేపీలో చేరి మరోసారి విజయం నమోదు చేశారు. గడిచిన శాసనసభ ఎన్నికల వేళ కాంగ్రెస్‌లో చేరి రాజాజీనగర్ నుంచి ఎమ్మెల్యే స్థానానికి పోటీ చేసేందుకు ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేశారు. దీంతో ఉప ఎన్నిక అనివార్యమైంది. ఎమ్మెల్యే ఎన్నికలలో ఓడినందున మరోసారి ఆదే స్థానం నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా బరిలో నిలిచారు. బీజేపీ- జేడీఎస్ పార్టీల ఉమ్మడి అభ్యర్థిగా ఏపీ రంగనాథ్ నామినేషన్ దాఖలు చేశారు. సోమవారం మాజీ సీఎం కుమారస్వామి, జీటీ దేవేగౌడ, బీజేపీ నేతలు మాజీ మంత్రి అశ్వత్థనారాయణ, తూపల్లి చౌడరెడ్డి, ఎమ్మెల్సీ శరవణ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కుమారస్వామి మాట్లాడుతూ ఉపాధ్యాయులు ప్రస్తుత ఎన్నికలలో రంగనాథ్‌కు సంపూర్ణ మద్దతు ఇస్తారని విశ్వాసం వ్యక్తం చేశారు. ఎవరి విలువలు ఏమిటో టీచర్లకు తెలుసని, ఎన్నికల ద్వారా సత్తా చూపుతారని పేర్కొన్నారు.



కోలారు ర్యాలీలో మాజీ సీఎం బసవరాజ్ బొమ్మై, ప్రతిపక్షనేత అశోక్ తదితరులు

కాంగ్రెస్ పట్ల ప్రజల్లో అసహనం

● 28 లోక్‌సభ స్థానాల్లో గెలిపిస్తే నెలలోనే ప్రభుత్వాన్ని ఇంటికి పంపుతాం ● మాజీ సీఎం బసవరాజ్ బొమ్మై

బెంగళూరు, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ప్రజా, రైతు, హిందూ వ్యతిరేక కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల్లో అసహనం ప్రారంభమైందని, లోక్‌సభ ఎన్నికల్లో చిత్తుగా ఓడించేందుకు సన్నాహాలు చేస్తున్నారని మాజీ ముఖ్యమంత్రి బసవరాజ్ బొమ్మై పేర్కొన్నారు. కోలారు పట్టణంలో సోమవారం ప్రభుత్వ వైఫల్యాలకు వ్యతిరేకంగా బీజేపీ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీని ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ లోక్‌సభ ఎన్నికల్లో 28 నియోజకవర్గాల్లోనూ బీజేపీ, జేడీఎస్ మిత్రపక్షం మన విజయాలు సాధిస్తే కేవలం నెలలోనే ఈ ప్రభుత్వాన్ని ఇంటికి పంపే గ్యారెంటీని తామిస్తామని పేర్కొన్నారు. కాంగ్రెస్ ఐదు గ్యారెంటీలకు పోటీగా ఇది తమ ఒకే ఒక్క గ్యారెంటీ అన్నారు. గ్యారెంటీ పథకాలతో ఖజానాను దివాళా తీయిస్తున్నారని, దళితుల సంక్షేమానికి ఉద్దేశించిన రూ.11వేల కోట్లకుపైగా నిధులు సైతం కూడా దారి తప్పాయని ఆరోపించారు. ప్రతిపక్షనేత ఆర్. అశోక్ మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వంలో కుమ్ములాటలు త్వరలోనే పతాకస్థాయికి చేరుకోవడం తథ్యమన్నారు. హిందూ వ్యతిరేక విధానాలు మానుకోవాలని, బుజ్జగింపు రాజకీయాలకు కాలం చెల్లిందని తెలిపారు. రాష్ట్రపతి ద్రౌపదిముర్మును ఏకవచనంలో సంబోధించడం ద్వారా సీఎం సిద్ధరామయ్య తన నిజస్వరూపాన్ని బయటపెట్టుకున్నారని అన్నారు. కాంతరాజ్ నివేదికను స్వీకరిస్తున్నట్టు ప్రభుత్వం ప్రకటించడం రాజకీయ గిమ్మిక్‌లో భాగమన్నారు. రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజల్లోనూ కేవలం ఏడాది కాంగ్రెస్ పాలనలోనే భ్రమలు తొలగిపోతున్నాయన్నారు.



తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1588.50	1,617.04
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	000	000
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	360	8,346
సామర్థ్యం (టీఎంసీలు)	9.83	53.42

మేలో తెలుగు సమితి స్వర్ణోత్సవాలు

బళ్లారి సిటీ,జనవరి 29: నగరంలో తెలుగు స్వర్ణో త్సవం నిర్వహించనున్నట్లు తెలుగు సంస్కృతి సమితి జిల్లా అధ్యక్షుడు గోపాలకృష్ణ తెలిపారు. సోమవారం నగరంలో పూర్వసిద్ధత సమావేశంలో ఆయన మాట్లా డుతూ తెలుగు సంస్కృతి సమితి ఏర్పడి 50సంవత్స రాలు పూర్తిచేసుకున్న సందర్భంగా ఉత్సవాలు నిర్వహి స్తున్నా మన్నారు. నాటికలు, ఏకపాత్రాభినయం, జాన పద, శాస్త్రీయ నృత్యపోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేస్తామన్నారు. కళాకారులు, తెలుగు భాషాభిమానులు ఉత్సాహంగా పాల్గొనాలన్నా రు. ఈసమావేశంలో కార్యదర్శి ప్రభాకర్, లక్ష్మీనారా యణ, దేవన్న, వెంకటేశులు, రామాంజనేయులు, గౌరీ ప్రసాద్, జీ.వెంకటేశులు పాల్గొన్నారు.

గంజాయి స్వాధీనం : ఇద్దరి అరెస్ట్



అరెస్టు చూపుతున్న పోలీసులు

బళ్లారిరూరల్, జనవరి 29 : గంజాయి స్వాధీనం చేసుకున్న పోలీసులు ఇద్దరు నిందితులను అరెస్ట్ చేశా రు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు సోమవారం బళ్లారి- సిరుగుప్ప మెయిన్ రోడ్డు సమీపంలో శ్రీపాద విశ్వాస్ తండ్రి విశ్వాస్ (56), గోపాల్ (31)ను అరెస్ట్ చేశారు. వీరు రాయచూరు జిల్లా సింధనూరు తాలుకా జాలగిరి గ్రామం ఆర్‌హెచ్ కాలనీకి చెందినవారు. వీరి వద్ద 16.940 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకు న్నారు. దీని విలువ దాదాపు రూ. 17 లక్షలు వరకు వుంటుందని బళ్లారి సైబర్ క్రైమ్ ఇన్స్‌పెక్టర్ రమాకాం త్ తెలిపారు. ఇద్దరినీ అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలిం చారు. దాడుల్లో ఎస్‌ఐ లీబాషా, పోలీసు సిబ్బంది సురేష్, వేణుగోపాల్, తిప్పేరుద్రప్ప, హనుమంతరెడ్డి, ఏలేష్, మంజునాథ, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

అప్పు తీర్చకపోతే అన్నదాతపై కేసులా..?

● కరువు జిల్లాగా ప్రకటించినా కనికరం లేదా.. ● గ్రామీణ బ్యాంకు ఎదుట రైతుల నిరసన



నిరసనలో పాల్గొన్న రైతులు

బళ్లారి సిటీ, జనవరి 29: గ్రామీణ బ్యాంకుల్లో రుణాలు తీసుకున్న రైతులపై కేసులు దాఖలు చేయడంపై అన్నదాత ఆగ్రహం వ్యక్తం చేశారు. వివిధ కోర్టుల్లో దాఖలైన కేసులపై జిల్లాయంత్రాంగం జోక్యం చేసుకోవాలని సోమవారం గ్రామీణ బ్యాంకు ముందు నిరసన చేపట్టారు. ఈసందర్భంగా జిల్లా రైతు సంఘం అధ్యక్షుడు మాధవరెడ్డి మాట్లాడుతూ 5 ఏళ్లుగా అతివృష్టి, అనావృష్టి, వర్షాభావ పరిస్థితుల్లో పండించిన పంటకు మార్కెట్‌లో సరైన ధర లభించక రైతులు ఇబ్బంది పడుతున్నారని, ఈఏడాది ప్రభుత్వం కరువు జిల్లాగా ప్రకటించిందన్నారు. ఇలాంటి విషమ పరిస్థితుల్లో బ్యాంకుల్లో రుణాలు తీసుకున్న రైతులకు నోటీసులు పంపడం తగదన్నారు. తీసుకున్న రుణాలకు వడ్డీ, చక్రవడ్డీ చేర్చి నాలుగింతలు పెంచి రుణాలు కట్టాలని కోర్టు నోటీసులు పంపారన్నారు. గ్రామీణ బ్యాంకు జారీ చేసిన వన్‌టైమ్ (ఓటీఎస్) కూడా రిజర్వ్ బ్యాంకు ఆఫ్ ఇండియా నిబంధనల ప్రకారం చేపట్టలేదన్నారు. గ్రామీణ బ్యాంకులో అధిక వడ్డీ వసూలు చేస్తున్నారని, దీనికి వ్యతిరేకంగా రాష్ట్రవ్యాప్తంగా రైతుల జాతా మార్చి 28న నిర్వహిస్తున్నట్లు, బళ్లారిలో బ్యాంకు ప్రధాన కార్యాలయం ఎదుట పెద్దఎత్తున నిరసన చేపట్టనున్నట్లు ఆయన తెలిపారు. ఈసందర్భంగా రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వాల్మీకి సంఘం నాయకుడి దుర్మరణం

కంప్లి, జనవరి 29 : రోడ్డు ప్రమాదంలో అఖిల కర్ణాటక వాల్మీకి సంఘం కంప్లి తాలుకా అధ్యక్షుడు దేవరమనె యల్లప్ప (79) రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. ఆదివారం కుటుంబ సభ్యులతో మంత్రాలయం రాఘవేంద్రస్వామిని దర్శించుకుని తిరిగి కంప్లికి వస్తున్న సమయంలో ఈ ప్రమాదం జరిగింది. వారు ప్రయాణిస్తున్న కారు చిందనూరు వద్ద అదుపుతప్పి ఎదురుగా వస్తున్న లారీ ఢీకొనడంతో తలకు బలమైన గాయాలయ్యాయి. దీంతో అక్కడికక్కడే మృతి చెందారు. కుమారుడు, మరొకరికి గాయాలు కావడంతో వారిని చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. ఆయన మృతిపై వాల్మీకి సమాజం సభ్యులు, కుటుంబ సభ్యులు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. కంప్లిలో జేఎన్ గణేష్, వాల్మీకి మహాసభ నాయకులు, పదాధికారులు నివాళులర్పించారు.





యల్లప్ప (ఫైల్)

కారును ఢీకొన్న లారీ

హనుమాన్ జెండా తొలగింపుపై నిరసన



గడిగి చెన్నప్ప సర్కిల్లో నిరసన తెలుపుతున్న బీజేపీ నాయకులు

బళ్లారి సిటీ, జనవరి 29: మండ్య జిల్లా కెరగోడు గ్రామంలో హనుమాన్ జెండాను తొలగించడంపై బీజేపీ కార్యకర్తలు ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వ వ్యతిరేకత, బీజేపీ కార్యకర్తలపై పోలీసుల దౌర్జన్యాన్ని వ్యతిరేకిస్తూ గనుల నాడు బళ్లారిలో బీజేపీ కార్యకర్తలు రోడ్డును దిగ్బంధించి నిరసన తెలిపారు. సోమవారం నగరంలోని గడిగి చెన్నప్ప సర్కిల్లో పార్టీ జిల్లా అధ్యక్షుడు అనిల్‌కుమార్ మోకా ఆధ్వర్యంలో పార్టీ నాయకులు ఎస్.గురులింగనగౌడ, గుత్తిగనూరు విరూపాక్షగౌడ, శ్రీనివాస్‌మోత్కార్, ఇబ్రహీంబాబు, గణపాల్ ఐనాథ్‌రెడ్డి తదితరులు గడిగి చెన్నప్ప సర్కిల్లో రోడ్డును దిగ్బంధించి నిరసన తెలిపారు. పాలక మండలి సభ్యులు, నాయకులు ఎస్. మల్లనగౌడ, తిప్పన్న, హనమంత, కుంటనాల్ మల్లికార్జునస్వామి, శరణ్, వెంకటేశ్, రామాంజిని, మహిళా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

కేఆర్‌పీపీ ఆధ్వర్యంలో..

హనుమాన్ జెండా వివాదంపై కేఆర్‌పీ నాయకులు సోమవారం నిరసన చేపట్టారు. బళ్లారి కలెక్టర్ కార్యాలయం వద్ద నిరసన చేపట్టిన కేఆర్‌పీపీ నాయకులు జిల్లా అధికారి యంత్రాంగానికి వినతిపత్రం సమర్పించారు. ఈసందర్భంగా పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గోనాల్ రాజశేఖర్‌గౌడ మాట్లాడుతూ రాష్ట్రంలో కరువు విలయతాండవం చేస్తున్నా రైతుల సమస్యలపై ముఖ్యమంత్రి సిద్దరామయ్యకు చలనం లేదన్నారు. కేవలం కులాలు, మతాల మధ్య చిచ్చు పెట్టడమే సరిపోయిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. నిరసనలో పార్టీనాయకులు సునీల్ రెడ్డి, కొలగల్లు అంజిని, దారప్ప నాయక్ తదితరులు పాల్గొన్నారు.



కలెక్టరేట్ వద్ద నిరసనలో కేఆర్‌పీపీ నాయకులు

పిల్లల్లో కళాత్మక ప్రతిభను గుర్తించాలి

బళ్లారి సిటీ,జనవరి 29: పిల్లల్లో కళాత్మక ప్రతిభను గుర్తించి, వారికి తగిన శిక్షణ ఇవ్వాలని ఛత్రపతి శివాజీ విద్యామందిర్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కొట్రప్ప అభిప్రాయపడ్డారు. సోమవారం కర్ణాటక సెలబ్రేషన్ -50 లో భాగంగా సండూర్ పట్టణంలోని ఛత్రపతి శివాజీ విద్యామందిర్ పాఠశాలలోని ఎం.వై.ఘోర్పడే హాల్లో కన్నడ సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 'చిగురు' సాంస్కృతిక కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి ఆయన మాట్లాడారు. సాంస్కృతిక శాఖ సహాయ సంచాలకులు బి.నాగరాజు మాట్లాడుతూ కన్నడ సాంస్కృతిక శాఖ కళలకు ఉత్తమ ప్రోత్సాహం అందిస్తోందన్నారు. సండూర్ విద్యాసంస్థ కార్యదర్శి డాక్టర్ జగదీశ్ బసాపురతో పాటు ఉపాధ్యాయులు, విద్యార్థులు, పాల్గొన్నారు.తదనంతరం కార్యక్రమంలో ఏక పాత్ర అభినయం, నాటకాలు విద్యార్థులు ప్రదర్శించారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న ప్రధానోపాధ్యాయుడు కొట్రప్ప

సన్మానాలు వద్దు పుస్తకాలివ్వండి : ఎమ్మెల్యే



ఎమ్మెల్యే గణేష్‌కు పాఠ్యపుస్తకాలు అందజేస్తున్న కార్యకర్తలు

కంప్లి, జనవరి 29 : తనకు సన్మానాలు, సత్కారాలు, బాణసంచాలకు బదులుగా పిల్లలకు పాఠ్యపుస్తకాలు ఇవ్వాలని ఎమ్మెల్యే గణేష్ అభిమానులకు సూచించారు. కంప్లి కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో బసరకోడుకు చెందిన గాదిలింగప్ప, మంజునాథ నాయక్, ఈశ్వరనాయక్, బసవ, రామన్నగౌడలు పూలదండలు, శాలువాలకు బదులుగా పిల్లల చదువుల కోసం పాఠ్యపుస్తకాలు ఎమ్మెల్యేకు అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆడంబరాలకు పెట్టే ఖర్చులు పేద పిల్లల చదువులకు పెడితే నిత్య జీవితంలో తాము గుర్తుండిపోతామని, కార్యకర్తలు, అభిమానులు గ్రహించాలన్నారు.

టెలీ ఐసీయూ హబ్‌తో రోగులకు తక్షణ చికిత్స

● శిక్షణా కార్యక్రమంలో డాక్టర్ కృష్ణ

బళ్లారి సిటీ,జనవరి 29: గ్రామాలు, తాలూకాల్లోని ఆసుపత్రుల్లో చేరిన రోగులకు వైద్య సలహాలు అందించేందుకు టెలీ ఐసీయూ హబ్ దోహదపడుతుందని విజయనగరం ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ ఇన్‌ఛార్జి డైరెక్టర్ డాక్టర్ కృష్ణ తెలిపారు. నగరంలోని జిల్లాఆసుపత్రిలో సోమవారం నుంచి నిర్వహించిన టెలీ ఐసీయూ హబ్ మూడు రోజుల శిక్షణ శిబిరాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. టెలీ ఐసీయూ హబ్ గ్రామాలు, తాలూకాల్లోని ఆసుపత్రుల్లో చేరిన రోగులకు అత్యవసర చికిత్స , సంరక్షణ అందించేందుకు ఇది ఎంతగానో దోహదపడుతుందన్నారు. జిల్లా సర్జన్ డాక్టర్ బసారెడ్డి అధ్యక్షత వహించి మాట్లాడుతూ బెంగళూరు, బళ్లారిలోని టెలీ ఐసీయూ హబ్ లను ప్రారంభించాలని ఇప్పటికే వైద్యారోగ్యశాఖ మంత్రి దినేష్‌గుండురావు నిర్ణయించారని, ఫిబ్రవరి 2న జిల్లాఆసుపత్రిలో ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. మొదటి భాగంలో జిల్లాఆసుపత్రి నుంచి సండూరు , సిరుగుప్ప తాలూకాలను ఎంపిక చేసి రెండు తాలూకాల వైద్యులు, నర్సులు, సిబ్బందికి శిక్షణ ఇస్తున్నా మన్నారు. టెలీ ఐసీయూ హబ్ ద్వారా రోగుల పరిస్థితిని అంచనావేసి నిపుణులైన వైద్యులు చికిత్స సలహాలు ఇస్తారన్నారు. జిల్లా ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ అధికారి డాక్టర్ రమేశ్ మాట్లాడుతూ టెలీ ఐసీయూ హబ్ ద్వారా వైద్యులు నేరుగా రోగులతో మాట్లాడి అవసరమైన వైద్యం అందిస్తున్నారన్నారు. దీంతో ఆసుపత్రుల్లో చేరే రోగుల సంఖ్య తగ్గుతుందన్నారు. డాక్టర్ బసారెడ్డి, డాక్టర్ కృష్ణ శిక్షణలో వైద్య సలహాలు, కౌన్సెలింగ్ కోసం కృత్రిమ మేధస్సు , ఇతర ఆధునాతన సాంకేతికతలను సమర్థవంతంగా ఉపయోగించాల్సిన అవసరాన్ని ప్రదర్శించారు. ఈసందర్భంగా విజయనగరం మెడికల్ ఇనిస్టిట్యూట్ ప్రిన్సిపాల్ డాక్టర్ కృష్ణస్వామి, జిల్లాఆసుపత్రి రెసిడెంట్ వైద్యాధికారి డాక్టర్ విశ్వనాథ్, జిల్లా లెప్రసీ నిర్మూలన అధికారి వీరేంద్రకుమార్, సర్జన్ బాల భాస్కర్‌రావు, జిల్లాఆసుపత్రి నోడల్ అధికారులు డాక్టర్ విమల, డాక్టర్ జ్యోత్స్న, సండూరు , సిరుగుప్ప తాలూకావైద్యులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



సిబ్బందికి అవగాహన కల్పిస్తున్న వైద్యులు

వక్ఫ్ భూములకు రక్షణ కల్పించాలి

●ఎస్‌డీపీఐ జిల్లా అధ్యక్షుడు జిలాని పాషా డిమాండ్



డీసీ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న ఎస్‌డీపీఐ కార్యకర్తలు, నాయకులు

రాయచూరు జనవరి 29 : జిల్లా వ్యాప్తంగా వక్ఫ్ భూములు, దర్గా స్థలాలు ఆక్రమణకు గురికాకుండా రక్షణ కల్పించాలని ఎస్‌డీపీఐ జిల్లాధ్యక్షుడు జిలాని పాషా డిమాండ్ చేశారు. వక్ఫ్ దర్గా భూముల అన్యాక్రాంతాన్ని నిరసిస్తూ సోమవారం జిల్లాధికారి కార్యాలయం వద్ద ఎస్‌డీపీఐ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడిన జిలాని పాషా, నగరంలోని కేఎస్‌ఆర్‌టీసీ సెంట్రల్ బస్‌స్టాండ్ వెనక భాగంలో ఉన్న విలువైన వక్ఫ్ స్థలాలు, ఆర్టీఓ సర్కిల్ వద్ద ఉన్న దర్గా స్థలాలు కబ్జాకు గురవుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. ఆస్తుల దురాక్రమణ కబ్జాలకు సంబంధించి తాము 2019 నుంచి ఇప్పటి వరకు పలు సార్లు వినతి పత్రాలు ఇచ్చినా జిల్లా అధికారుల నుంచి, నగరసభ అధికారుల నుంచి ఎలాంటి స్పందన లేదన్నారు.

మద్యంపట్టివేత

రామగిరి, జనవరి 29: శ్రీ సత్యసాయి జిల్లా రామగిరి మండలంలోని ఎగువపల్లి చెక్‌పోస్టు వద్ద కర్ణాటక మద్యాన్ని ఆదివారం రామగిరి పోలీసులు పట్టుకున్నారు. రామగిరి పోలీసులు తెలిపిన వివరాల మేరకు..మండల పరిధిలో ఎగువపల్లిచెక్ పోస్టు వద్ద ఆదివారం రాత్రి తనిఖీలు నిర్వహిస్తుండగా కర్ణాటక మద్యం తరలిస్తున్న టాటా ఇండికా కారు పోలీసులు నిలపగానే అందులో ఉన్న ఇద్దరు వ్యక్తులు పరారయ్యారు. కారును పరిశీలించగా అందులో 30 కేసులు కర్ణాటక మద్యం పట్టుబడింది. దీని విలువ రూ.1, 15, 120 ఉంటుందన్నారు. దీనిపై రామగిరి ఎస్‌ఐ జనార్ధన్‌నాయుడు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

చంద్రబాబుతో కమ్మసంఘం నాయకుడి భేటీ



చంద్రబాబునాయుడును సత్కరిస్తున్న కమ్మసంఘం నాయకులు రాము

కంప్లి, జనవరి 29 : కర్నూలు జిల్లాల్లో పర్యటిస్తున్న మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడును కుడితిని కమ్మసంఘం అధ్యక్షుడు రాము ఆదివారం కర్నూలు జిల్లా పత్తికొండలో కలిసి అభినందించి సన్మానించారు. ఈ సందర్భంగా రాము మాట్లాడుతూ జిల్లాలోని తెలుగుదేశం పార్టీ నాయకులు రాబోయే ఎన్నికలను దృష్టిలో వుంచుకుని తమ వంతుగా పార్టీ గెలుపొందేందుకు కృషి చేస్తామని తెలిపామన్నారు. ఏపీలో అభివృద్ధి కావాలంటే మరోసారి చంద్రబాబు నాయుడు సీఎం కావాలని, జిల్లా వ్యాప్తంగా ఉన్న తెలుగువారు టీడీపీ విజయానికి కృషి చేయాలని ఆయన సంఘం నాయకులను కోరారు. వారితో పాటు కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి, కోట్ల సుజాత, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

హోసూరు జోన్

హత్య కేసులో ముగ్గురికి జీవితఖైదు

హోసూరు, జనవరి 29: హోసూరు సమీపంలో 2017లో ఓ రైతు కత్తిపోట్లకు గురై మృతి చెందిన కేసులో నిందితులకు హోసూరు అదనపు జిల్లా, సెషన్స్ కోర్టు జీవితఖైదు శిక్ష విధిస్తూ తీర్పునిచ్చారు. కుప్పటికి చెందిన రైతు వెంకటేశప్ప(57)ను తన స్నేహితుడు లక్ష్మీనారాయణ ద్విచక్ర వాహనంలో దేవగానపల్లి గ్రామానికి ద్విచక్ర వాహనంపై తీసుకెళ్లాడు. వీరిద్దరు అక్కడికి వెళ్లేందుకు ముందే లక్ష్మీనారాయణ స్నేహితులు బసవరాజు(30), సంతోష్ కుమార్(30)లు అక్కడ వేచి ఉన్నారు. ద్విచక్ర వాహనాన్ని ఆపి డబ్బులు డిమాండ్ చేశారు. అందుకు వెంకటేశప్ప నా వద్ద డబ్బులు లేదని, ఎంత పోరాడినా ఆ ముగ్గురు వదలకుండా అతడిని కత్తితో పొడిచి హతమార్చారు. సమాచారం అందుకున్న తళి పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఎట్టకేలకు సోమవారం కేసుకు సంబంధించి తీర్పు వచ్చింది. న్యాయమూర్తి వారికి జీవితఖైదు విధిస్తూ తీర్పు వెలువరించారు.

నేడు మత సామరస్యంపై ప్రతిజ్ఞ

హోసూరు జనవరి 29: పశ్చిమ జిల్లా డీఎంకే కార్యాలయంలో మత సామరస్య ప్రతిజ్ఞ స్వీకార సభ జరుగుతోంది. ఇందులో పాల్గొనాలని పశ్చిమ జిల్లా కార్యదర్శి ఎమ్మెల్యే వై ప్రకాశ్ ఒక ప్రకటనలో తెలిపారు. తమిళనాడు ముఖ్యమంత్రి ఆదేశానుసారం దేశ ప్రజలందరూ ఐక్యంగా జీవించాలని మంగళవారం ప్రారంభించనున్నారు. మంగళవారం ఉదయం 9 గంటలకు హోసూరు డీఎంకే కార్యాలయంలో మత సామరస్య ప్రతిజ్ఞ కార్యక్రమం జరుగనుంది. దేశం ఎదుర్కొంటున్న మతపరమైన సంఘటనలను అరికట్టాలని, అన్ని మతాల ప్రతినిధులు, మాజీ శాసనసభ్యులు, జిల్లా పరిపాలకులు, నగర యూనియన్, కార్యదర్శులు, రాష్ట్ర జిల్లా అధికారులు, యూనియన్, ఆయా వార్డుల ఉపాధ్యక్షులు, ఆర్గనైజర్లు, అన్ని టీంలు, సభ్ ఆర్గనైజర్లు హాజరుకావాలని కోరారు.

యువరైతు ఆత్మహత్య

రామగిరి, జనవరి 29: శ్రీసత్యసాయి జిల్లా రామగిరి మండలంలోని గంగంపల్లి గ్రామంలో మురళీమోహన్(34) అనే యువ రైతు ఆత్మహత్య చేసుకున్నట్లు గ్రామస్థులు తెలిపారు. యువరైతు మురళీమోహన్‌కు 10 ఎకరాల భూమి ఉంది. వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగించేవాడు. సోమవారం 3గంటల సమయంలో తోట వద్దనున్న పశువుల పాకలో ఉరివేసుకుని మృతిచెందాడు. కుటుంబసభ్యులు వెంటనే గ్రామస్థులకు తెలియజేశారు. సంఘటనపై పోలీసులకు సమాచారం అందించారు.

అనుమతి లేని దుకాణాల సీజ్

హోసూరు(మత్తిగిరి), జనవరి 29: హోసూరు కార్పొరేషన్‌లోని మొత్తం 45 వార్డులలో 5వేలకు పైగా దుకాణాలు వ్యాపార లైసెన్స్ లేకుండానే నడుపుతున్నట్లు తెలిసింది. ఈ విషయమై మున్సిపల్ అధికారులు వ్యాపార లైసెన్సులు పొందేందుకు ముందుకురాని వారిపై చర్యలు తీసుకున్నారు. సోమవారం మున్సిపల్ సంక్షేమ అధికారి ప్రభాకరన్, మున్సిపల్ డిప్యూటీ కమీషనర్ టిటో, టౌన్ అధికారులు మలర్విళి, ఆర్‌ఐ సురేశ్ , ఇతర అధికారులు కలిసి హోసూరు సిటీ బస్టాండ్, హోసూరు టౌన్ మొత్తం తనిఖీలు చేశారు. లైసెన్స్ లేని దుకాణాలకు సీల్ వేశారు. ఆ తర్వాత నేతాజీ రోడ్డు, ఎంజీ రోడ్డుతో పాటు పలు ప్రాంతాల్లో నిర్వహిస్తున్న దుకాణాలను కూడా పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులు మీడియాతో మాట్లాడుతూ దాదాపు 5వేలకు పైగా దుకాణాలు వ్యాపార లైసెన్స్ లేకుండానే నిర్వహిస్తున్నారని, అధికారులు నోటీసులు ఇచ్చిన తర్వాతను కూడా వెయ్యి మంది మాత్రమే లైసెన్సు తీసుకున్నారన్నారు. తనిఖీ చేసిన దుకాణాలలో కొంతమందికి జరిమానా విధించి గడువు ఇవ్వగా మరికొన్నింటిని సీల్ వేసినట్లు తెలిపారు.



తనిఖీలు నిర్వహిస్తున్న అధికారులు

ఉచిత వైద్య శిబిరం

హోసూరు(సిప్‌కాట్), జనవరి 29: హోసూరు కార్పొరేషన్ 22వ వార్డు పరిధిలోని మునీశ్వర్ నగర్ 7వ క్రాస్ లో ముఖ్యమంత్రి సమగ్ర వైద్య బీమా పథకం, మునిశ్వర్ నగర్ నిర్వాసితుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. మున్సిపల్ పబ్లిక్ హెల్త్ కమిటీ చైర్మెన్ మాదేశ్వరన్ అధ్యక్షతన శిబిరాన్ని ప్రారంభించారు. డాక్టర్ ప్రియదర్శిని ఆధ్వర్యంలో వైద్యబృందం గుండె సమస్యలు, కీళ్లనొప్పులు, థైరాయిడ్ ట్యూమర్లు, గర్భాశయ కణితలు, రక్తపోటు, షుగర్ స్థాయిని పరిశీలించారు. శిబిరంలో వందలాది మంది పాల్గొని పరీక్షలు చేయించుకున్నారు. అలాగే 45 ఏళ్ల పైబడిన వారికి ఈసీజీ పరీక్షను ఉచితంగా ఏర్పాటు చేశారు. మునీశ్వర్ నగర్ రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు ప్రకాశ్, నిర్వాహకులు మణికంఠన్, చిత్ర, యశోధరాణి, చిన్నబయ్యన్, తమిళవణ్ణన్ పాల్గొన్నారు.



చికిత్స నిర్వహిస్తున్న వైద్యులు

షరతులు సడలించాలి

● కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు రంగప్ప అస్కిహాళ్



వినతి పత్రం అందజేస్తున్న కార్మిక సంఘం నేతలు

రాయచూరు జనవరి 29 : భవన నిర్మాణం ఇతర అనుబంధ రంగం కార్మికుల రిజిస్ట్రేషన్ విషయంలో ప్రభుత్వం విధించిన షరతులు సడలించాలని ప్రగతిశీల భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు రంగప్ప అస్కిహాళ్ డిమాండ్ చేశారు. కార్మికుల రిజిస్ట్రేషన్ రెన్యువల్‌లో విధించిన షరతులను నిరసిస్తూ నిర్మాణ రంగ కార్మికులు సోమవారం జిల్లాధికారి కార్యాలయం వద్ద ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడిన రంగప్ప, నిరక్షరాస్యులైన నిర్మాణ రంగ కార్మికులు హాజరు పట్టికతో పాటు ఇతరత్రా అనుమతులకు సంబంధించిన ధ్రువీకరణ పత్రాలు సమర్పించడంలో విఫలమవుతున్నారన్నారు.

ఘనంగా ఖాసీమ్ వలీ తాత ఉరుసు



ప్రార్థనలో పాల్గొన్న మత గురువులు, భక్తులు

సిరుగుప్ప, జనవరి 29 : ఖాసీమ్ వలీ తాత ఉరుసు మహోత్సవాలు సోమవారం ఘనంగా జరుపుకున్నారు. తాలుకాలోని హాశేకోట గ్రామంలో వెలసిన ఖాసీమ్ వలీ తాత ఉరుసు మహోత్సవాల సందర్భంగా ముస్లిం గురువులు గడ్డే ఖాదర్ బాషా, అబ్దుల్ నబీ తాత వారికి మొక్కుబడులు సమర్పించుకున్నారు. మూడు రోజుల పాటు గంధం, ఉరుసు, జియారత్ కార్యక్రమాలు నిర్వహిస్తారు.

పునీత్ విగ్రహానికి మరమ్మతులు చేపట్టాలి

● కలెక్టర్, ఎమ్మెల్యేకు అభిమానుల వినతి



కలెక్టర్ కార్యాలయం వద్ద పునీత్ అభిమానులు

బళ్లారిరూరల్, జనవరి 29 : నగరంలోని జిల్లా స్టేడియం ఆవరణంలో ఏర్పాటు చేసిన పునీత్ రాజ్‌కుమార్ విగ్రహం వద్ద అభివృద్ధి పనులు చేపట్టాలని ముత్తురాజ్ ఫ్రెండ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కలెక్టర్‌కు, సిటీ ఎమ్మెల్యే నారాభరత్ రెడ్డికి సోమవారం వినతిపత్రం అందజేశారు. రాజ్‌కుమార్ విగ్రహం పూర్తిగా పాడైందని, రంగు మొత్తం పోయిందని, ఆయనకు పూలమాలలు వేసేందుకు అవసరమైన నిచ్చెన, స్టేజీ, ఇనుప మెట్లు ఏర్పాటు చేయాలని కోరుతూ మనవి పత్రం అందించారు. ముత్తురాజు మిత్రబృందం, రమేష్‌నాయక్, గోపాల్, తిప్పేస్వామి, అంజప్ప, యర్రిస్వామి, మంజప్ప తదితరులు పాల్గొన్నారు.

నేటి ప్రముఖులు

పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శ. శంకరనారాయణ కాయ్...

మహాత్మాగాంధీ (వర్ధంతి)



దేశ స్వాతంత్ర్యం కోసం పోరాడి 'జాతిపిత', 'మహాత్మా'గా ప్రజలచే గౌరవించబడి చరిత్రలో చెరగని ముద్ర వేసిన మోహన్ దాస్ కరంచంద్ గాంధీ 1869 అక్టోబరు 2న గుజరాత్ రాష్ట్రం పోర్‌బందర్ ప్రాంతంలో జన్మించారు. సత్యం, అహింస ఆయన ప్రముఖ సిద్ధాంతాలు. సహాయ నిరాకరణ, సత్యాగ్రహం మార్గంతో రవి అస్తమించని బ్రిటీష్ సామ్రాజ్యాన్ని గడగడలాడించి స్వాతంత్ర్యం సిద్ధించేలా చేశారు. ప్రపంచ మానవాళిని ప్రభావితం చేసిన మహానేత. 1948 జనవరి 30న హత్యకు గురయ్యారు.

వళ్లలార్ (వర్ధంతి)



ప్రపంచవ్యాప్తంగా వళ్లలార్‌గా పేరొందిన జ్యోతి రామలింగ స్వామి 1823 అక్టోబరు 5న తమిళనాడు రాష్ట్రం చిదంబరం ప్రాంతం మరుదూరు గ్రామంలో జన్మించారు. కులబేధాలు పాటించరాదని ప్రచారం చేస్తూ ఆచరించడం ద్వారా సమాజంలో చైతన్యం కలిగించారు. గొప్ప సాధువుగా ఉంటూ ఎన్నో రచనలు చేశారు. కులబేధాలను పాటించడం అమానవీయమని ప్రచారం చేసి ఆచరించారు. ప్రపంచంలో శాంతి, ప్రేమను కాంక్షిస్తూ కవిగా గాయకుడిగా 'తిరు అరుప్పా' పేరిట 5818 పద్యాలను రచించారు. 1874 జనవరి 30న అదృశ్యమయ్యారు. ఆయన అదృశ్యమైన స్థలంలో దివ్యజ్యోతి దర్శనమిచ్చిందని మద్రాస్ గెజిట్‌లో ప్రచురించబడడం విశేషం.

వ్యాసరాయ బల్లాళ (వర్ధంతి)



ప్రముఖ కన్నడ రచయిత, కేంద్ర సాహిత్య అకాడమీ గ్రహీత వ్యాసరాయ బల్లాళ 1923 డిసెంబరు 1న కర్ణాటక రాష్ట్రం ఉడిపి ప్రాంతంలో జన్మించారు. బందాయ, హేమంతగాన, అనురక్తె, వాత్సల్యపథ, ఉత్తరా యణ వంటి రచనలు ఎంతో పేరొందాయి. వందలాది చిన్నకథలు రాశారు. కాగా ఆకాశవాణి ముంబైకు సుదీర్ఘకాలం సేవలందించడం విశేషం. కర్ణాటక సాహిత్య అకాడమీతోపాటు మహా రాష్ట్ర ప్రభుత్వం నుంచి గౌరవం, ఇతర పురస్కారాలు అందుకున్నారు. 2008 జనవరి 30న కన్నుమూశారు.

అమృతా షేర్-గిల్ (జయంతి)



అమృతా షేర్-గిల్ 1913 జనవరి 30న హంగేరీ దేశం బుడాపెస్ట్‌లో జన్మించారు. 20వ శతాబ్దానికి చెందిన ప్రముఖ భారతీయ చిత్రకారిణి. దేశంలో అత్యంత ఖరీదైన పెయిం టింగ్‌లు చిత్రీకరించిన కళా కారిణి ఆమెయే. 19వ యేట 'యంగ్ గర్ల్స్' పేరిట గీసిన ఆయిల్ పెయింటింగ్‌తో గుర్తింపు పొందారు. 1938లో గోరఖ్‌పూర్‌లోని తన ఎస్టేట్‌లో గీసిన 'ఇన్ ది లేడీస్ ఎన్‌క్లోజర్' చిత్రం 2021లో శాఫ్రాన్ ఆర్ట్‌సంస్థ నిర్వహించిన వేలంలో రూ. 37.8 కోట్లకు అమ్ముడైంది. న్యూ ఢిల్లీలోని నేషనల్ గ్యాలరీ ఆఫ్ మోడ్రన్ ఆర్ట్‌లో ఆమె కళాఖండాలు ప్రదర్శించబడ్డాయి. 28వ యేట 1941 డిసెంబరు 5న కన్నుమూశారు. 2013లో యునెస్కో ఆమె శత జయంతి నిర్వహించడం విశేషం.

జీన్ హాక్‌మన్ (పుట్టినరోజు)



యూజీన్ అల్లెన్ హాక్‌మన్ 1930 జనవరి 30న జన్మించారు. అమెరికాకు చెందిన నటుడు, నవలా రచయిత. ఆరు దశాబ్దాలలో రెండు అకాడమీ అవార్డులు, నాలుగు గోల్డెన్ గ్లోబ్స్, రెండు బాఫ్టా అవార్డులు, ఒక స్క్రీన్ యాక్టర్స్ గిల్డ్ అవార్డు అందుకున్నారు. ఆయన నటించిన సినిమాలన్నీ విభిన్నంగా ఉంటూ ప్రజలను ఆకట్టుకున్నాయి. 1971లో 'ది ఫ్రెంచ్ కనెక్షన్' లోని జిమ్మీ పొపెయె డాయెల్ క్యారెక్టర్ ఎంతో గుర్తింపు తెచ్చింది. 2003లో 'సిసిల్ బి డిమిల్లె అవార్డు' గౌరవం అందుకున్నారు. 2004లో నటనకు రిటైర్‌మెంట్ ప్రకటించారు. మూడు చారిత్రాత్మక ఫిక్షన్ నవలలు రాశారు.

పేలిన గ్యాస్ సిలిండర్

- ఆరుగురికి గాయాలు... ఇల్లు నేలమట్టం
- రూ. పది లక్షలకు పైగా ఆస్తి నష్టం

కుందుర్పి, జనవరి 29: మండలంలోని తెనగల్లు గ్రామంలోని ఓ ఇంటిలో సోమవారం సిలిండర్ పేలిన ఘటనలో ఇల్లు నేలమట్టమయ్యింది. ఈ సంఘటనలో ఆరుగురు గాయపడగా, వారిలో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉంది. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి... తెనగల్లు గ్రామంలోని షేక్ ముస్తాబ్ ఇంట్లో రెండు గ్యాస్ సిలిండర్లను ఉంచాడు. రాత్రంగా ఒక సిలిండర్ లీక్ అవుతుండగా, ఉదయం కరెంటు బల్బును ముస్తాబ్ ఆన్ చేశాడు. వెంటనే పొగలు వ్యాపించడంతో బయటకు కేకలు పెడుతూ వచ్చాడు. చుట్టుపక్కల వారు సంఘటనా స్థలానికి చేరుకుని ఇంట్లో ఉన్న మరో సిలిండర్‌ను బయటకు తీసుకువచ్చారు. ఈ సమయంలో మరో సిలిండర్ పెద్దశబ్దంతో పేలింది. వెంటనే మంటలు వ్యాపించాయి. ఈ ఘటనలో బాధితుడికి సహాయం చేయడానికి వచ్చిన ఆరుగురు గాయపడ్డారు. వారిని 108లో కళ్యాణదుర్గం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో సిద్ధేశ్వర, చౌడప్పలను అనంతపురం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. భీమరాజు, నారాయణస్వామి, రామాంజనేయులు, మారుతిలకు స్వల్ప గాయాలు కాగా కళ్యాణదుర్గం ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. సంఘటనా స్థలానికి అడిషనల్ ఎస్పీ రామిరెడ్డి విజయభాస్కర్ రెడ్డి, డీఎస్పీ శ్రీనివాసులు, సీఐ నాగరాజు, ఎస్‌ఐ వెంకటస్వామి చేరుకుని స్థలాన్ని పరిశీలించి గ్యాస్ పేలేందుకు గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. బాధితుడు ముస్తాబ్ చిల్లర దుకాణం నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు. ఈ ఘటనలో రూ.10 లక్షల వరకు ఆస్తి నష్టం సంభవించిందని బాధితుడు తెలిపాడు. ఫైరింజన్ సమయానికి చేరుకోవడంతో సిబ్బంది మంటలను ఆర్పారు. రెస్క్యూటీమ్ ఎక్స్‌కవేటర్ సహాయంతో రోడ్డుపై పడివున్న రాళ్లను తొలగించారు. అనంతరం పేలిన గ్యాస్ సిలిండర్‌ను పరిశీలించారు. తమను ప్రభుత్వమే ఆదుకోవాలని బాధితుడు కోరుతున్నాడు.

డిజిటల్ రంగంలో మరిన్ని ఆవిష్కరణలు

- జీఎంఎఫ్ఎక్స్ సదస్సు ప్రారంభంలో సీఎం సిద్దరామయ్య

బెంగళూరు, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): డిజిటల్ రంగంలో యానిమేషన్, విజువల్ ఎఫెక్ట్, గేమింగ్, కామిక్ (ఏవీజీసీ) విభాగాలలో ఆవిష్కరణలు ప్రగతి దశలో ఉండడం సంతోషకరమని సీఎం సిద్ధరామయ్య అభిప్రాయపడ్డారు. నగరంలో సోమవారం జీఏ ఎఫ్ఎక్స్ పేరిట ఐదవ విడత సదస్సును సీఎం లాంచనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ సాంకేతిక పరిజ్ఞానం, ఆవిష్కరణలో కర్ణాటక దేశంలోనే ప్రగతిదశలో ఉందన్నారు. కర్ణాటకలో మీడియా అండ్ ఎంటర్‌టైన్‌మెంట్ రంగాలు 20శాతం ప్రగతి సాధించాయని కొనియాడారు. 15వేలమందికిపైగా ఉద్యోగాలు పొందారని 300కుపైగా ప్రత్యేక స్టూడియోలు ఏర్పాటయ్యాయన్నారు. మీడియాలో ఎంటర్‌టైన్‌మెంట్‌తోపాటు డిజిటల్ అడ్వర్టైజ్‌మెంట్ విభాగం కూడా పెరిగిందన్నారు. ప్రపంచంలో అతిపెద్ద కంటెంట్ ఉత్పాదన భారత్‌లోనే ఉందన్నారు. 150 వేల గంటల టీవీ కంటెంట్, 2500 గంటల ప్రీమియం ఓటీటీ కంటెంట్ ఉండగా 2021లో 2వేల గంటల చిత్రీకరణ కంటెంట్ సృష్టించబడిందన్నారు. ఏటా డిజిటల్ మీడియా ప్రగతికి రాష్ట్రం ముందంజలో ఉండడం సంతోషమన్నారు. స్టార్టప్‌లు ఎంఎస్ఎంఈల ఐలో పేతంతోనే కొత్త ఇండస్ట్రీలు వస్తున్నాయన్నారు. రాష్ట్రంలో 27 లలితకళ కళాశాలల్లో 600మంది విద్యార్థులు డిజిటల్ ఆర్ట్ సెంటర్‌లో శిక్షణ పొందుతున్నారన్నారు. మూడు రోజుల సదస్సు మరిన్ని ఆవిష్కరణకు చర్చలు, పరిష్కారాలకు కేంద్రం కానుందని కొనియాడారు. డీసీఎం డీకే శివకుమార్, ఐటీబీటీశాఖల మంత్రి ప్రియాంక ఖర్గే, కియోనెక్స్ బోర్డ్ చైర్మన్ శరత్ బచ్చేగౌడ, తదితరులు భాగస్వామ్యులయ్యారు. మారుతున్న సాంకేతికతకు అనుగుణంగా పిల్లలను ప్రోత్సహించాలన్నారు. వివిధశాఖల అధికారులు పాల్గొన్నారు. సదస్సులో ముఖ్య మంత్రి సిద్ధరామయ్యకు ప్రత్యేక జ్ఞాపిక అందచేసి సత్కరించారు.



సదస్సు ప్రారంభంలో సీఎం, డీసీఎం తదితరులు

గ్రామీణ ప్రాంతాల విద్యార్థులకు ఉచిత విద్యా సదుపాయం కల్పించాలి

బెంగళూరు, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాలలో విద్యార్థులందరికీ ఉచితంగా హైటెక్ స్థాయి విద్యాసదుపాయం కల్పించాలని ఈ దిశలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చొరవ తీసుకోవాలని ఆచార్య రాకుమ్ గురూజీ సూచించారు. ఆచార్య రాకుమ్ విద్యా సంస్థ 21వ వార్షికోత్సవాన్ని ఉద్దేశించి సోమవారం ఆయన ప్రసంగించారు. దేశంలో చిన్నారులందరికీ ఉచిత విద్య, ఉచిత ఆరోగ్య సదుపాయాలు అందుబాటులోకి రావాలని ఆకాంక్షించారు. ప్రత్యేకించి గ్రామీణ ప్రాంతాల విద్యార్థులు నేటికీ విద్యావంచితులవుతూనే ఉన్నారని ఆయన ఆవేదన వ్యక్తంచేశారు. నగర, పట్టణాల ప్రదేశాల్లో ఉంటున్న విద్యార్థులకైతే ఆధునిక విద్యాసదుపాయాలు, క్రీడలకు సంబంధించిన అత్యున్నత శిక్షణ అందుబాటులో ఉంటోందని అయితే గ్రామీణ ప్రాంతాలలో ఇలాంటి సదుపాయాలు లేకపోవడంతో మట్టిలో మాణిక్యాలను వెలికితీయలేకపోతున్నామని ఆయన వాపోయారు. తమ నిర్వహణలోని విద్యాసంస్థల్లో ఉచితంగా భోజనం సదుపాయంతో పాటు ఉచితంగా పాఠ్యపుస్తకాలను అందజేస్తున్నామని ఉత్తమ ఆరోగ్యం కోసం యోగా, ఆధ్యాత్మిక కార్యక్రమాలు, రక్షణ కోసం కరాటే వంటివి నేర్పిస్తున్నామన్నారు. జాతిపిత మహాత్మాగాంధీ కలలు గన్న రామరాజ్య నిర్మాణం సాకారం కావాలంటే గ్రామీణ ప్రాంతాల విద్యార్థులు విద్య, ఆరోగ్య రంగాలలో పరిపూర్ణత సాధించాల్సి ఉందన్నారు. గ్రామాల వికాసంతోనే దేశ వికాసం సాధ్యం కాగలదన్నారు. విధానపరిషత్ మాజీ సభ్యుడు ఆర్‌వీ వెంకటేష్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల నిరుపేద, మధ్యతరగతి విద్యార్థులకు ఉచిత విద్యను అందిస్తున్న రాకుమ్ గురూజీని ప్రత్యేకంగా అభినందించారు. ఇదే సందర్భంగా విద్యార్థులచే పలు సాంస్కృతిక కార్యక్రమాలు జరిగాయి. ఇదే వేదికపై సమాజసేవకులు డా.నేత్రావతి, పుట్టరాజు, ఉమేష్, విజయకుమార్, డా.సుధారాణి, ప్రకాష్‌లకు ప్రత్యేక పురస్కారాలను అందజేసి సన్మానించారు. కార్యక్రమంలో పంచాయితీ మాజీ సభ్యులు మహేష్‌కుమార్, అశ్విని రవికుమార్, పంచాయితీ మాజీ అధ్యక్షురాలు రాజణ్ణ, విద్యాశాఖ అధికారి శ్రీధర్, ప్రధానోపాధ్యాయులు డి.మంజునాథ్, గోవిందరాజు, సీనియర్ ఉపాధ్యాయుడు నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



జ్యోతి ప్రజ్వలన కార్యక్రమంలో ప్రముఖులు



సాంస్కృతిక ప్రదర్శనలో చిన్నారులు

30 మందికి ల్యాప్‌టాప్‌ల పంపిణీ

శిడ్లఘట్ట, జనవరి 29: ప్రథమ, ద్వితీయ పీయూసీలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు 30మందికి ప్రభుత్వం తరఫున ల్యాప్‌టాప్‌లు పంపిణీ చేశారు. కట్టడ కార్మిక మండలి తరఫున తాలూకా పంచాయితీ సభాభవనంలో సోమవారం ఏర్పాటైన కార్యక్రమంలో ఎమ్మెల్యే బీఎన్ రవికుమార్ మాట్లాడుతూ రానున్న రోజుల్లో అందరికీ ల్యాప్‌టాప్‌లు అందాలన్నది తమ ఉద్దేశ్యమన్నారు. ఇప్పటివరకు నగరసభ ద్వారా రూ.85లక్షల గ్రాంటు ఉందని ఏప్రిల్‌లో 150మందికి ల్యాప్‌టాప్‌లు అందచేయాలన్న లక్ష్యం కలిగినట్లు తెలిపారు. విద్యార్థులు చక్కగా చదివి ప్రయోజకులు కావాలని, పాఠశాలకు, తల్లిదండ్రులకు, సమాజానికి మంచి పేరు తేవాలన్నారు. ప్రస్తుతం ఇదే తొలిసారిగా కార్మికశాఖ ఆధ్వర్యంలో అసలైన కార్మికులను గుర్తించి వారి పిల్లల సాధనను ప్రోత్సహించేలా ల్యాప్‌టాప్‌లు అందచేసినట్లు తెలిపారు. ప్రథమ పీయూసీలో సైన్స్, కామర్స్, ఆర్ట్స్‌లో ఐదుమంది చొప్పున, ద్వితీయ పీయూసీలోనూ ఐదు మంది చొప్పున అందచేశారు. ఈ సందర్భంగా తాలూకా పంచాయితీ ఈఓ మునిరాజు, నగరసభ కమిషనర్ మంజునాథ్, ప్రభుత్వ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు సుబ్బారెడ్డి, మేలూరు మంజునాథ్, జడ్పీ మాజీ సభ్యుడు బంక్ మునియప్ప తదితరులు పాల్గొన్నారు.



ల్యాప్‌టాప్‌లు అందజేస్తున్న ఎమ్మెల్యే రవికుమార్

నాయకత్వం అంటే సేవ చేసే అవకాశం



ఎన్ఎస్ఎస్ శిబిరం ప్రారంభంలో ప్రముఖులు

బాగేపల్లి, జనవరి 29: సమాజంలో నాయకులంటే అధికారం, దర్పం చూపించేది కాదని సేవ చేసే అవకాశంగా భావించాలని బెంగళూరు ఉత్తర విశ్వవిద్యాలయం ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ విజయ్‌కుమార్ అభిప్రాయ పడ్డారు. పట్టణ శివారులోని ప్రభుత్వ ఫస్ట్ గ్రేడ్ కళాశాలలో డాక్టర్ జనని కళాక్షేత్ర సభాంగణంలో సోమవారం ఏర్పాటైన ఎన్ఎస్ఎస్ జిల్లాస్థాయి నాయకత్వ తర్ఫీదు రెండు రోజుల శిబిరాన్ని ప్రారంభించారు. శిబిరం విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ నాయకత్వం అంటే అధికారం కాదని సేవ చేసే అవకాశమని, నిస్వార్థ సేవలతోనే సమాజంలో గౌరవం సాధ్యమన్నారు. స్వామి వివేకానంద భక్తిని సేవగా భావించారని, అదే విధంగా కువెంపు, బసవణ్ణలు కూడా సేవాభావంతో మనం పనిచేయాలని భావించా రన్నారు. కాగా మొబైల్, ఇతర చెడు అలవాట్లకు బానిస కారాదని హితవు పలికారు. గ్రామీణ ప్రాంత నిరక్షరాస్యులైనవారు దేశం కోసం శ్రమిస్తుంటే అక్షరాస్యులైన యువత డ్రగ్స్, గుట్కా ఇతర వాటికి త్వరగా వ్యసనాలకు గురవుతున్నారని విచారం వ్యక్తం చేశారు. మొబైల్ సాంకేతిక పరిజ్ఞానాన్ని దుర్వినియోగం చేయరాదన్నారు. శిబిరంలో డాక్టర్ సత్యనారాయణరెడ్డి, ప్రిన్సిపాల్ వై నారాయణ, వెంకటరావ్, బీవీ శ్రీనివాసరెడ్డిసేజీ సుధాకర్, డాక్టర్ నాగరాజు, ఓబళరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహభరితంగా ప్రతిభోత్సవ

బెంగళూరు, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): బెంగళూరు సుంకదకట్టెలోని అంజలి కాన్వెంట్, నైటింగేల్ ఉన్నతపాఠశాలలో వార్షిక ప్రతిభోత్సవ 2024 ఉత్సాహభరితంగా జరిగింది. ఈ ఉత్సవాన్ని బీబీఎంపీ మాజీ కార్పొరేటర్ మోహన్‌కుమార్ లాంఛనంగా ప్రారంభించారు. విద్యాసంస్థ కార్యదర్శి ఎం.ఎస్.సరళ, ప్రిన్సిపాల్ డాక్టర్ బీ కృష్ణేగౌడ, బీబీఎంపీ మాజీ సభ్యులు హెచ్ఎన్ గంగాధర్, తొంటదార్య జానపద కళాకారుడు గంగా గంగయ్య, జూనియర్ రవిచంద్రన్, ప్రముఖ నటి రేఖాదాస్ తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు. కాగా 2023లో ఎస్ఎస్ఎల్‌సీ పరీక్షల్లో 85 శాతం కంటే అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను వేదికపై ఘనంగా సన్మానించారు. కాగా ముఖ్యఅతిథి మోహన్‌కుమార్ ప్రసంగిస్తూ గత 12 సంవత్సరాలుగా ఈ విద్యాసంస్థ ఎస్ఎస్ఎల్‌సీలో 100 శాతం ఫలితాలను సాధిస్తుండటం ఎంతో సంతోషకరమన్నారు.



ప్రతిభోత్సవంలో పురస్కారాలతో విద్యార్థులు

పాల సహకార సంఘం అధ్యక్షుడిగా సురేశ్



నూతన అధ్యక్ష, ఉపాధ్యక్షులతో పాలసహకార సంఘం డైరెక్టర్లు

శిడ్లఘట్ట, జనవరి 29: తాలూకాలోని గంగనహళ్ళి పాల ఉత్పత్తిదారుల సహకార సంఘం నూతన అధ్యక్షుడిగా కాంగ్రెస్ మద్దతుదారుడైన జీవీ సురేశ్, ఉపాధ్యక్షుడిగా జీఎం ముత్తేగౌడ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సోమవారం సంఘం అధ్యక్ష, ఉపాధ్యక్ష స్థానాలకు జరిగిన ఎన్నికల్లో 11మంది డైరెక్టర్‌లు పాల్గొన్నారు. ఎస్టీ, బీసీ(బీ) స్థానాలు ఖాళీగా ఉన్నాయి. డైరెక్టర్‌లు కరగప్ప, అశ్వథప్ప, నాగరాజ్, శివానంద, దిలీప్, పిళ్ళేగౌడ, శివానంద, నంజమ్మ, యశోదమ్మ పాల్గొన్నారు. నూతన అధ్యక్ష, ఉపాధ్యక్షులను డైరీ మాజీ అధ్యక్షుడు బీసీ వెంకటేశప్ప అభినందించి మాట్లాడుతూ పాల ఉత్పత్తిలో నాణ్యతను కాపాడుకుంటూ వచ్చామని అదే విధానం కొనసాగించాలన్నారు. పాల సమాఖ్య ద్వారా అందే సౌలభ్యాలను పాడి రైతులకు అందేలా సంఘం మరింత చొరవ చూపాలన్నారు. ఈ సందర్భంగా తాలూకా పంచాయితీ మాజీ అధ్యక్షురాలు సీ ప్రమీళా వెంకటేశ్, గ్రామపంచాయితీ సభ్యులు కమలమ్మ వెంకటరాయప్ప, ప్రముఖులు వేణుగోపాల్, ఈఓ జీసీ బైరేగౌడ పాల్గొన్నారు.

పెట్టుబడిదారులకు వీలుగా ఎన్‌సీడీ

బెంగళూరు, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): గోల్డ్‌లోన్ వ్యాపారాల ద్వారా దక్షిణభారత్ వ్యాప్తంగా పేరొందిన ఇండెల్ మనీ లిమిటెడ్ సంస్థ పెట్టుబడుదారులను ఆకర్షించేలా నాన్ కన్వర్టబుల్ డిబెంచర్‌ల స్కీంకు శ్రీకారం చుట్టింది. సోమవారం బెంగళూరులో కంపెనీ ఈడీ సీఈఓ ఉమేష్‌మోహనన్ మీడియాకు వివరించారు. ప్రతి వేయి రూపాయలతో సురక్షిత ఎన్‌సీడీలను మంగళవారం నుంచి ఆరంభిస్తామని ఫిబ్రవరి 12 వరకూ కొనసాగిస్తామన్నారు. ఇండెల్ కంపెనీ దక్షిణభారత్‌లోని అన్ని రాష్ట్రాలతో పాటు ఒడిస్సాలలో 268 శాఖల ద్వారా లక్షమందికిపైగా ఖాతాదారులను కలిగి ఉన్నామన్నారు. ఆర్థికసంవత్సరం ఆఖరునాటికి మరిన్ని రాష్ట్రాలకు విస్తరింప చేయదలచినట్లు తెలిపారు. ఎన్‌సీడీ ద్వారా భారీగా పెట్టుబడులు సాధించదలచామన్నారు. 366 రోజుల నుంచి 72నెలలకు సురక్షిత ఎన్‌సీడీలకు ఆహ్వానించామన్నారు. కంపెనీలోని అన్ని విభాగాలలోను ఆర్థిక నిపుణుల పర్యవేక్షణ ఉందన్నారు. 1986లో చిన్న ఫైనాన్స్‌తో ఆరంభమై గోల్డ్‌లోన్‌ల ద్వారా అన్నివర్గాలకు అందుబాటులో ఉండేలా రుణాలు అందిస్తున్నట్లు తెలిపారు.

మునగనహళ్లి డెయిరీ ఎన్నికల్లో జేడీఎస్ హవా

చింతామణి, జనవరి 29: తాలూకాలోని మునగనహళ్ళి గ్రామ పాల ఉత్పత్తిదారుల సహకార సంఘానికి వచ్చే ఐదేళ్ల అవధికి పాలకమండలిలోని 12 డైరెక్టర్‌ల స్థానాలకు సోమవారం ఎన్నికలు జరిగాయి. 12 స్థానాలకుగాను 7 స్థానాలలో జేడీఎస్ మద్దతుదారులు గెలుపొందగా ఐదు స్థానాల్లో కాంగ్రెస్ మద్దతుదారులు విజయం సాధించారు. జేడీఎస్ మద్దతుదారులైన డైరెక్టర్‌లు ముని వెంకటరెడ్డి, సుబ్రమణి, విశ్వనాథ్, శ్రీనివాస్, గోవిందప్ప, దేవరాజ్, రత్నమ్మలు విజయం సాధించగా కాంగ్రెస్ మద్దతుదారులైన రవీంద్ర, మంజునాథ్, ముని అంజనప్ప, వెంకటేశ్, సరస్వతమ్మలు గెలుపొందారని ఎన్నికల అధికారి నాగరాజ్ ప్రకటించారు. విజేతలను ప్రత్యేకంగా అభినందించి సత్కరించారు. ఈ సందర్భంగా ఏ గ్రామ ప్రముఖులు నారాయణస్వామి, ఎంఎస్ శ్రీనివాస్, వెంకటేశప్ప, ముని నారాయణప్ప, అశ్వత్థరెడ్డి, అంజప్ప, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.



పాలసహకార సంఘం నూతన డైరెక్టర్లతో గ్రామస్థులు

బస్ షెల్టర్ ఏర్పాటు చేయండి



రోడ్డుపక్కన ఆలయానికి వెళ్లే ఆర్చ్ ఇలా...

చేళూరు, జనవరి 29: తాలూకాలోని బురుడగుంటె గ్రామపంచాయతీలో పురాతన గంగమ్మ దేవి ఆలయం ఎంతో ప్రసిద్ధి చెందింది. అమ్మవారిని దర్శించుకునేందుకు చుట్టుపక్కల ప్రాంతాలవారే కాకుండా సరిహద్దులోని ఆంధ్రప్రదేశ్ ప్రాంత భక్తులు కూడా వస్తుంటారు. అమ్మవారిని కొలవడం ద్వారా తమ కోరికలు త్వరగా నెరవేరుతాయని భక్తుల విశ్వాసంగా ఉంది. ఆది, మంగళ, శుక్రవారాలలో భక్తులు ఎక్కువగా వస్తుంటారు. చింతామణి నుంచి బస్సు సదుపాయం ఉంది. ప్రైవేట్ వాహనాలలో కూడా భక్తులు వస్తుంటారు. అయితే బస్ షెల్టర్ లేకపోవడంతో భక్తులు అసౌకర్యానికి గురవుతున్నారు. రోడ్డుపక్కన ఉండే దుకాణాల వద్ద వేచి ఉండాల్సి వస్తోంది. బస్ షెల్టర్ ఏర్పాటు చేయాలని స్థానికులు, భక్తులు కోరుతున్నారు.

ఫిబ్రవరి 4న త్యాగరాజ, పురంధరదాస అరాధనా మహోత్సవం

బెంగళూరు, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): బెంగళూరులోని పద్మావతి కళానికేతన్ ఆధ్వర్యంలో 44వ వార్షిక సంగీతోత్సవం, త్యాగరాజ, పురంధరదాస ఆరాధనా మహోత్సవం ఫిబ్రవరి 4న జరుగనుంది. ఈ మేరకు సంస్థాపక కార్యదర్శి జీవీ వేణుగోపాల్ నగరంలో సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. నగరంలోని శ్రీకృష్ణదేవరాయ కళామందిరంలో జరిగే ఈ కార్యక్రమానికి కర్ణాటక ధార్మిక పరిషత్ సభ్యులు డాక్టర్ ఏ రాధాకృష్ణరాజు ముఖ్యఅతిథిగా విచ్చేయనున్నారు. గౌరవ అతిథిగా భారతీయ సంగీత నృత్య కళాకారుల సమాఖ్య అధ్యక్షుడు విద్వాన్ సాయి నారాయణ్ హాజరు కానున్నారు. అనంతరం గురు డా. చింతలపల్లి జలజా ప్రసాద్, డా.చింతపల్లి మంగళ భాస్కర్, విదూషి డా.చంద్రికా ప్రహ్లాద్, విదూషి స్మిత దేవాసిన్హా, విదూషి భారతి వెంకటేష్, విద్వాన్ చింతలపల్లి శ్రీనివాస్, విద్వాన్ చింతలపల్లి సోమశేఖర్‌లచే కర్ణాటక సంగీతం, పంచ రత్న కీర్తనల ఆలాపన ఉంటుందని ప్రకటనలో పేర్కొన్నారు. కేంద్ర సాంస్కృతిక శాఖ సహకారంతో ఈ కార్యక్రమం ఫిబ్రవరి 4న ఉదయం 8.30 గంటలకు ప్రారంభం కానుంది.

నగరంలో దేవరాస్ రుచులు

బెంగళూరు, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): నోరూరించే రుచులకు పేరొందిన దేవర శెట్టి కుటుంబం నగరంలోని రాజాజీనగర్‌లో కొత్తశాఖను ఏర్పాటు చేయదలిచింది. ఏపీకి చెందిన దేవరశెట్టి వెంకటపతిశెట్టి, భార్య ఆదిలక్ష్మమ్మలు చిన్నపాటి దుకాణంద్వారా పొడులు, సంప్రదాయ వంటకాలను పరిచయం చేశారు. 2023 సెప్టెంబరులో దుబాయ్‌లో శాఖను తెరవడం ద్వారా అంతర్జాతీయస్థాయికి ఎదిగారు. తాజాగా రాజాజీనగర్‌లో కొత్తశాఖను తెరవనున్నట్టు దేవరశెట్టి విశాల్ సోమవారం మీడియాకు తెలిపారు. ప్రాచీనపాకపద్ధతికి అనుగుణంగా సాధారణ ఆహార పదార్థాలకే ప్రత్యేకమైన పొడులు, ఆవకాయ రైస్, గోంగూర రైస్ వంటివి పరిచయం చేస్తున్నామన్నారు.

వడ్డీ మాఫీ ప్రయోజనం పొందండి

బాగేపల్లి, జనవరి 29: తీసుకున్న రుణాలలో అసలు చెల్లించడం ద్వారా వడ్డీని పూర్తిగా మాఫీ చేసే సదుపాయాన్ని రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిందని రైతులు సద్వినియోగం చేసుకోవాలని పీఎల్‌డీ బ్యాంకు అధ్యక్షుడు వీ ప్రభాకరరెడ్డి తెలిపారు. ఈ మేరకు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. డిసెంబరు 31 నాటికి రుణం మొత్తాన్ని తిరిగి చెల్లించడం ద్వారా వడ్డీని మాఫీ చేసేలా ప్రభుత్వం ఆదేశించిందన్నారు. ఫిబ్రవరి 29వరకు ఈ అవకాశం ఉందని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

బీఐఎస్ అధికారుల ముసుగులో బంగారం దోచుకునే యత్నం

- నలుగురి అరెస్టు

బెంగళూరు, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ (బీఐఎస్) అధికారుల ముసుగులో బంగారు నగల దుకాణానికి వెళ్లి బెదరించి నగలు దోచుకునే యత్నం చేసిన నలుగురిని కేఆర్ పుర పోలీసులు అరెస్టు చేశారు. ఈనెల 27న కేఆర్‌పురలోని మహాలక్ష్మి జ్యువెలర్స్‌కు నలుగురు కారులో వచ్చారు. తాము బీఐఎస్ అధికారులమని పరిచయం చేసుకున్నారు. హాల్‌మార్క్ లేకుండా బంగారం విక్రయిస్తున్నారంటూ సమాచారం వచ్చిందని బెదరించారు. 40 నిమిషాలపాటు నలుగురూ పలు ఆభరణాలను పరిశీలించారు. సుమారు 80లక్షల రూపాయల విలువైన కేజీకిపైగా బంగారు ఆభరణాలు తీసుకుని ఓ నోటీసు ఇచ్చారు. వచ్చేవారం తమిళనాడు రాజధాని చెన్నైలోని బీఐఎస్ కార్యాలయానికి రావాలని సూచించారు. అయితే వెళ్లేముందు సీసీటీవీ డీవీఆర్‌ను వారు స్వాధీనం చేసుకున్నారు. దీంతో అనుమానం వచ్చిన దుకాణం సిబ్బంది వారిని వెంబడించారు. అంతలోనే యజమాని కేఆర్‌పుర పోలీసులకు సమాచారం ఇచ్చారు. కారులో నలుగురు తప్పించుకునే ప్రయత్నం చేయగా పోలీసులు వెంటపడ్డంతో టీసీపాళ్య జంక్షన్ వద్ద ముందున్న వాహనానికి ఢీ కొట్టారు. ఇదే సమయంలో పలు వాహనాలు ఒకటికొకటి ఢీ కొన్నాయి. పోలీసులు వారిని వెంబడించి అరెస్టు చేశారు. పట్టుబడినవారిలో సంపత్ అనే వ్యక్తి గతంలో మండ్యలో చోరీ కేసులో ఆరోపితుడు కాగా మిగిలినవారిని జోషి థామస్, అవినాశ్, సందీప్‌లుగా గుర్తించారు. వీరి వెనుక ఉండే సూత్రధారి తమిళనాడువాసిగా గుర్తించి అతడికోసం గాలింపులు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

మహిళపై దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

పావగడ, జనవరి 29: తాలూకాలోని కడపలకెరె గ్రామానికి చెందిన మహిళా రైతు లక్ష్మీదేవిపై దాడిచేసిన పోలీసులను వెంటనే సస్పెండ్ చేయాలని రైతు సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు రైతు సంఘం తాలూకా అధ్యక్షుడు పూజారప్ప ఆధ్వర్యంలో తాలూకా కార్యాలయానికి చేరుకొని తహసీల్దార్ వరదరాజులకు వినతిపత్రం అందజేశారు. బాధిత మహిళకు న్యాయం చేయాలని, దాడికి పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని ఆ వినతిపత్రం ద్వారా ముఖ్యమంత్రి, హోం మంత్రికి విన్నవించారు. మధుగిరి డీవైఎస్పీ రామచంద్రప్ప ఒక ఉన్నతాధికారి అయి ఉండి మహిళ అనే కనికరం లేకుండా ఆమెపై సిబ్బందితో కలిసి దాడి చేయడం అమానుషం అన్నారు. దాడి చేసిన వారిని సస్పెండ్ చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈసందర్భంగా వందలాది మంది రైతు సంఘం నాయకులు పాల్గొన్నారు.



తహసీల్దార్ వరదరాజుకు వినతిపత్రం అందజేస్తున్న రైతు సంఘం నాయకులు